అంగుళీయకము

గర్భాం అప్పారావుగారు, బి. ఏ.

ఒకనాటి మధ్యాహ్నమున మేఘములు క్రిందిభాగము నావరించియుండెను, వర్షము పడుచుండెను. శీతల వాయుప్రచారము మిక్కుటముగా నుండెను. మోహనశ్యామసుందరుల సంభాషణ మగ్గములోనినాడెవలె జరుగుచుండెను.

మోహనుడు శాలువ కప్పుకొని యొక్క కుర్చీపై కూర్చుండెను. శ్యామసుందరుడు పడుకకుర్చీపై జేరబడి 'ఏనుగుమార్కు సిగరెట్టు' వెలిగించుచుండెను. శ్యామసుందరుడు సంభాషణనిమగ్నుడౌటచే చలిబాధ లక్ష్యము చేయకుండెను.

"చూడుము మోహనా! న్యాయవాదిమాత్రము స్వతంత్రజీవనముకలవాడాయేమి! సేవకవృత్తిలోనున్న వాడొకరిద్దరు యజమానులయాజ్ఞ శిరసావహింపవలెను. న్యాయవాదియు లోకులకు సేవచేయవలసినవాడే. కావున నిరువురికి సామ్యము లేకపోలేదు. ఏదైన పరమగహనము సేవకవృత్తియే" అని శ్యామసుందరుడు పలికెను.

"అదెట్లు? సేవకుడనువా డొకరిచిత్తవృత్తి ననుసరించి తిరుగవలెను. న్యాయవాది యీ విషయమున స్వతంత్రుడు. ఎవడు నాతని నాజ్ఞాపించలేడు." అని మోహనుడు నుడివెను.

"న్యాయవాదివి కమ్ము. నేను పలికినదానిలోని సత్యమెరుగగల"వని శ్యామసుందరుడు నుడివెను.

"సరే! చూచెద"నని మోహనుడు పలికెను. సంభాషణపద్ధతి యట్లుండెను. చర్చ కడు కదలిక గలిగి యున్నను సారాంశమేమియు తేలలేదని శ్యామసుందరుడు తెలిసికొనెను. కొంతవరకు మూకీభావము వహించెను. అతని దృష్టి సిగరెట్టుపైబడెను. అయ్యది వెలుగుచుండలేదు. కాన దానినుండికూడ నాతడు సారమేమియు గ్రహింపలేకుండెను. అందుచే మరల సంభాషణకుదిగెను.

"మోహనా! నీవు తర్కశాస్త్రజ్ఞుడవు. అయిన నెన్నడు నేనేవిషయము నీ మనమున కెక్కింపలేదు."

"అది నా తప్పుకాదు. నీ వెన్నడట్లు చేయలేవు. కాని వాదముల ఫలితమంతే. నీకట్టివాదమే తెలియును."

ఈ మాటకు శ్యామసుందరుడు కోపము తెచ్చుకొని "చివరకు నీవిట్టిమార్గమునే యవలంబించెదవు. తగిన హేతువులు చూపలేనపుడు నీవు మనశ్శల్యములగు వాక్కులు ప్రయోగింతువు. నీలోనున్న లోపమే యిది" అని పలికెను.

"అదిగో! నీవు నీ యిష్టానుసారము మాటలు ప్రయోగించెదవు. నేను నీతో వాగ్వాదమునకు సరిగానని నీవు పలికినపుడే నీవు పొరపడితివని తలంపవు."

ఈ మాటపై శ్యామసుందరుడు సిగరెట్టు క్రిందపడవైచి కినుకతో నాసీనుడై తనజేబులోనుండి రుమాలు తీసి సులోచనముల అద్దములు శుభ్రపరచి లేచి "నీవు న్యాయవాదివగుటకు దుర్బుద్ధి పొడముచున్నది. సరే జయముపొందుము. నేను పోయెద ననుచు శ్యామసుందరుడు వెడలిపోయెను. మోహను"డాలోచనా నిమగ్నుడైయుండెను.

*　　*　　*　　*

మోహనశ్యామసుందరులు ఆంధ్రనియోగి బ్రాహ్మణవంశమునకు జెందినవారు; ఏకకుటుంబ జనితులు; మిత్రులు. మోహనునితండ్రి స్వోపయోగమునకై బెజవాడలో నొకప్రత్యేకగృహము కట్టించియుండెను. అంతకుపూర్వము కుటుంబమంతయు బందరులోనుండెను. మోహన శ్యామసుందరులు పాఠశాలయందు క్రింది తరగతులలో ప్రవేశించునపుడు స్నేహము కుదిరెను. నాటి నుండియు వారిమైత్రి దినదినాభివృద్ధి పొందెను. వస్త్రధారణమున నేమి, అభిరుచులలోనేమి, యభిప్రాయములలోనేమి, పరీక్షాఫలితములలో నేమి వారెన్నడు వేరు

కా లేదు. చివరకు కళాశాలా పరీక్షాఫలితములందు గూడ నైక్యమునే పొందిరి.

*   "   *   *

ఇప్పుడు వారి భావిజీవితము చింతనీయము. దాని విషయమై యింతవరకు చర్చించియుండిరి. మోహనునికి న్యాయవాదిగా ప్రవేశింప తలంపు. శ్యామసుందరుడు కూడ న్యాయవాది పరీక్షయం దుత్తీర్ణుడైయున్నా నా వృత్తియం దాతని కభిమానము లేదు. తనమిత్రుడు న్యాయవాదిగా బ్రవేశించుటకు కృతనిశ్చయుడైయున్నం దునను మిత్రుడవలంబింపని వృత్తిని దా నవలంబింప నిష్టము లేనివాడగుటను తాను సహితమావృత్తిలో బ్రవేశింప నాలోచించుచు అప్పుడు మోహనుని విడిచి పైకేగెను.

తిన్నగా శ్యామసుందరుడు వీథిలోనికి రాగానే తళుక్కుమని మెఱుపు మెఱసెను. అత డాకసమువంక జూచెను. తనజేబులో సొమ్ముకై చేతులుదూర్చెను. కాని శూన్యహస్తములే పైకివచ్చినవి. మరల నింటి వైపు తిరిగెను. మోహనుని తల్లి కన్పడెను. ఆమెను సొమ్మడిగెను. ఆమె "ఎందుకు? ఇంతలోనే వెడలి పోయెదవా?" అనెను అందుకాతడు సరియగునుత్తరు వీయక "నేను నడిచిపోవలంచితి. వర్షముపడునట్లున్నది. కాన, ధూమశకట మెక్కిపోవలెను."

మోహనుని తల్లి యాతనికి కొంతపైకమిచ్చెను. అతడు పోవుచు వదిన యిచట లేనపుడు గృహవ్యాపార మెట్లు సాగింపగలుగుచున్నావని యామెనడిగెను. "ఏదో ఒకతీరున; నీభార్యకు కుశలమా?" అని యామె యడిగెను. ఈలోగా నాతడు గృహద్వారము దాటిపోయెను.

ఒకనాటి మధ్యాహ్నము మోహనుడు శ్యామసుం దరు నింటికి వచ్చెను. సేవకు లాతనితో శ్యామసుందరుడు కొలదికాలముక్రిందనే షికారు వెడలెనని చెప్పిరి. వెంటనే మోహనుడు ఉత్సాహవిహీనుడై శ్యామసుందరు జనని యున్న మేడగదికేగెను.

"మోహనా! ఈమందు వేసవిలో నెచ్చటికి ప్రయాణసన్నద్ధుడవై యున్నావు? ఇప్పుడే శ్యాముడు షికారు వెడలెను" అని యామె పలికెను.

మోహనుడు—మా పినతల్లి కుమార్తె పెండ్లి. "నేను గుంటూరు వెళ్లవలసియున్నది. నేను వెళ్లనిచో మా పినతల్లి కోపగించుకొనును. ఈ విషయము చెప్పుటకై వచ్చితిని. శ్యామసుందరుడు వచ్చు సమయమైనదని తలంచెదను."

శ్యామ. తల్లి—"ఏమైనసరే. ఇట్టియెండలో నీవు గుంటూరు వెళ్లరాదు. కడునాయాసపడెదవు. శ్యాము డెతంలో వచ్చునో చెప్పజాలను. బాంకీకి వెళ్లెను. ఇందిరా! మోహనుడు గుంటూరు వెళ్లనున్నాడు. మార్గమున వేసికొనుటకై కొన్ని తమలపాకు లిమ్ము."

మోహ—"అవునవును. నాకు హితమే. నేను వీని సేవించినప్పుడెల్ల నిన్ను స్మరించుచుండెదను."

ఈ మాట కామె నవ్వెను. ప్రక్కగదిలోనున్న శ్యాముని హృదయేశ్వరియు నవ్వెను. మోహనుడు చేతి గడియారము చూచికొనియెను. అప్పుడు శ్యాముని తల్లి రైలుబండికి వేళ యయినదని గ్రహించి మోహనునకు తమలపాకులు తెచ్చుటకై వెడలెను. మోహనుడును లేచి శ్యామసుందరుని చదువు గదిలోనికి పోయెను. మార్గాయాసము పోవ మనోహరమగు నవల యేదైన నుండునని పుస్తకము లన్నియు వెదకెను. క్రొత్తపుస్తక మొకటి యాతని కంటబడెను. అది తీసి తెరచుసరి కొక యుత్తరము అందు కనబడెను. కవరు పై విలాసము తనభార్యచే వ్రాయబడియుండెను. ఆమె శ్యామసుందరునికి తిరుపతినుండి వ్రాసినది. మోహనుని మామగారు తిరుపతిలో నుద్యోగముండుండెను.

అయిదారు దినములనుండి తనభార్య వృత్తాంత మేమియు తెలియమిచే నుత్సాహపూరితుడై యుత్తరము విచ్చెను. కాని యందలి ప్రథమాక్షరములే యాతనికంపితునిజేసెను. ఎట్లెట్లో యాత డుత్తరమంతయు చదివెను. అందినట్లున్నది:

"ప్రాణప్రియా!

నాపై మీకుకోపమా? మా వదినయొక్క అడ్డుచే నేను మీ కుత్తరము వ్రాయ వీలు లేన్నది. పరిహాసప్రియు

రాలగు నామె చూడకుండ ఉత్తరము వ్రాయ వీలు లేకున్నది. అట్లుచూచినయెడ నాకు సిగ్గు. నే నుత్తరములు వ్రాయుటలో వెనుకబడితినని మీరు వ్రాయ మానరాదు. మానినచో నా మనసు నొచ్చును. మీ యుత్తరము వచ్చినచో రహస్యముగా చదివి దాని నాహృదంతరమున సర్వకాల సర్వావస్థల నుంచెదను. అందువిషయమై మీ రేమియు సందియపడవలదు. మీ వియోగము నే నొక్కక్షణమైన భరింపజాల. నా మనోవ్యాకులత మీ రెరుంగజాలరు. నా యంతశ్చక్షువుచే మిమ్మెప్పుడును గాంచుచుండెదను. నా విశ్రాంతిసమయమున నా మానసవీధిని మిమ్ము స్మరించుచుండెద. మీరును నన్నట్లాదరించుచుండెదరా? అందు సహస్రాంశమైన నాపై ప్రేమకలిగియుండెదరా? ఈ జవాబునకై నా మన మాతురపడుచుండును. దూరముగానున్న మీ యర్థాంగిని మరువకుడు.

"ఈ విషయము పైకి నుడువరానిదైనను నాయాత్మను లోనతపింప జేయుచుండుటచే దాని వెడలగ్రక్కవలసెను. మదీయాభీష్టమొండు తీర్చెదరని మిమ్ము కోరుచున్నాను. ఆనాడు మనల జూడ నొక పార్సీ యువతివచ్చినది. ఆమె యొక యంగుళీయకమును ధరించియుంట కంటిరికదా. అనురాగము వెదజల్లుచున్న కెంపు ఆ యువతి యంగుళి కెంత సొంపు కలిగించుచుండెను? ఆ యువతిశరీరచ్ఛాయ యాసొంపును ద్విగుణీకృతముగావించియున్నది. అట్టిఛాయ మనకు లేదు. శరీరకాంతి లేనంతమాత్రమున నంతి చక్కని యాభరణము ధరించుట కభ్యంతర మేమి? నేను దాని ధరించుట మీ కిష్టమగునేని నొకటి నా కొఱకు పంపుడు. నా వ్రాతలో మార్దవము లేదు. దయయుంచి క్షమింపవేడుచున్న దాన. వదిన వచ్చుచుండుటచే లేఖిని యిచ్చట నాగినది. సెలవుతీసికొనెద. మనసార నర్పించిన నా ప్రేమాంజలి గొనుడు.

త్వదీయ హృదయాంబుజ భ్రమర-భ్రమర."

మోహానుని తల గిరగిర తిరుగుచుండెను. అతని నాడీపరీక్ష నెవరైన జేయుదురేని ప్రాణములు వీడిపోవుచున్నవని పలుకవలసినదే! ఉత్తరమందలి ప్రత్యక్షరము



విషపూరితమగు శల్యమై మనస్సును బాధించుచుండెను. భ్రమర తన భ్రమర యేనా? యువతుల ప్రేమ యథోలోకమునకు ద్రోయవలసినదేనా? ఇవన్నియు నటనలేనా? మయూరము లొయారము గల పక్షులు; కూతయతికటువు. కేతకి పరిమళోద్గారి; కంటకావృతము. దంతపుబొమ్మలవలె ధవళకాంతుల వెదజల్లు శరీరచ్ఛాయ గలిగి విషపూరిత హృదయలగు ముదితల నెవడు నమ్మునో వానిజీవితము నిస్సారము. ఇట్టి యాలోచనచే మోహానుని మన సల్లకల్లోలమగుచుండెను. ప్రపంచకమంతయు నంధకారమగ్నమయ్యెను. ఒకచో నాసీనుడయ్యెను. 'శ్యామసుందరుడు నాబాల్యస్నేహితుడు. హామిత్రమా! పవిత్రహృదయా! నీవు నన్ను మోసపుచ్చితివా' అని తలంచుచుండెను.

కంకణారావములు చెలగ శ్యామసుందరుని భార్య గదిలోనికివచ్చెను. తములపాకులు కొన్ని యాతనికిచ్చి "మీ రెప్పుడు తిరుపతినుండి తిరిగివచ్చెదర"ని యడిగెను. ఆసమయమున నీర్ష్యాసూయా క్రోధములు ముప్పిరిగొన

నాతడు మండిపడుచుండెను. ఆతడే ప్రత్యుత్తరమీయలేదు. మౌనవ్రతమును గాంచి యాతని మోము దిక్కామె చూచెను. తన్ముఖ వివర్ణతకు బెగడొందెను.

“మీ శరీర మస్వస్థతగా నున్నదియా? గుంటూరు ప్రయాణము మానరాదా?” అని యాతనితో బలికెను.

అతడు మోటుగా “మానను” అనుచు లేచి మారు మాటాడక వడివడి మెట్లుదిగి క్రిందికిబోయెను.

ఉపరిభాగమునుండి హఠాత్తుగా క్రిందపడిన యొక యిత్తడిపాత్రజింగురుమనుధ్వని ప్రతిధ్వనులతో గదినంతయు నింపిన లక్షణము, మోహనుని చిడిముడిపోకడవలన గదియందు కలిగెను. ఇందిర జీవితమున నిట్టిచర్య నూతనము. ఆమెయెన్నడు మోహనునందట్టి లక్షణము గనలేదు. శ్యామసుందరు నామె పెండ్లియాడిన దినమునుండి మోహనుడామెయెదుట స్వేచ్ఛతో బ్రవర్తింపుచు నాతడపహాస్యవచనముల నామెకుత్సాహముకలిగించుచుండెను. అట్లయిన నిదియేమి? అట్టి విషయమెన్నడైన జరుగునని యామెతలంచలేదు. మోహనుడు కొలది నిముసముల క్రింద నాసీనుడైయున్న కుర్చీపై నామె యాసీనయై యందుకు తగినకారణ మరయుచుండెను.

మేజాపై కొన్ని పుస్తకములుండెను. ఆ దినమే వానినామె సరిగా పేర్చియుంచినది. కాన నందునుండి వేరుపడియున్న నూతన గ్రంథమొకటి యామె దృష్టి నాకర్షించినది. దానిని తీసి తెఱచినది. భ్రమర వ్రాసిన యుత్తరము కంటబడినది. ఉత్తరము చదివినది. మోహనుడు దాని నచ్చటమరచెనని యూహించినది. కాని మోహనుడచ్చోటు నావిధముగా బాయుటకు గతంబేమి? ఈ విషయ మామెను పలుమరు బాధించుచుండెను. అనాదరభావముతో నా యుత్తరము కవరులోనుంచి మేజాపై విడిచెను. ఆలోచనా నిమగ్నయై యుండుటచే కవరుపై వ్రాతగమనింపలేదు. ఉత్తరమట్లు అజాగ్రత్తగా వదలుట మంచిదికాదని తలంచి తనపెట్టెలో దాచనుద్దేశించి తన గదిలోనికేగి ట్రంకుపెట్టె తెఱచెను. పెట్టెలో కవరుంచుచుండ పైవ్రాత కనబడెను. ఆమె ముఖము వెలవెల బాఱెను. ట్రంకు పైమూత ఆమె చేతిగాజులపైబడి వానిని పగులగొట్టి చేతికి గాయములు కలిగించెను. ఆ సమయమున నా గాయములు కలిగిన సంగతియే తెలియకపోయెను. విషయ నిర్ధారణకై యాలోచించుచుండెను. తత్క్షణమే మోహనునవస్థకు కారణమేమో కనుగొనెను. ఆమె మొగమంతయు పాలిపోయెను. నుదుటిపై చిరుచెమటలు కమ్మెను.

వెంటనే తనలో “భ్రమరకేమి పిచ్చియా? ఈ యుత్తరముయొక్క కవరిదికాకపోవచ్చును. ఈకవరులో వచ్చిన యుత్తరము మరియొకటి కావచ్చును.” అని ట్రంకు పెట్టె యట్టె తెరచియుంచి శ్యామసుందరుకు చదువుకొను గదిలోనికేగి ప్రతిస్థలము వెదకెను. కాని యుత్తరము మరొకటి కన్పడలేదు. దీనితో నామె హృదయాంధకారము మరింత దట్టమయ్యెను.

మోహన శ్యామసుందరుల హృదయములొక్కటియే యని ఇందిరకు తెలియును. అట్టి మైత్రి యెచ్చట నామె కాంచలేదు. ఈ హేతువుచేతనే భ్రమరతో నామె స్నేహముచేసెను. ప్రపంచమందలి వైభవమంతయు నాకు భ్రమరా మోహన శ్యామసుందరులందే యున్నది. ఇట్టి బంధమును విడగొట్టు దుర్దినము వచ్చినదని విచారించెను. ఆమె దృష్టికవరోధము కలిగించుచు కన్నీటి బిందువు లామె కన్నుల నావరించినవి.

ఇందిర మరల నిట్లు తలంచెను.

‘మోహనబాబు తనకు భ్రమర వ్రాసిన యుత్తరమిచ్చుట మరచి నా ప్రాణవిభునకు వ్రాసిన యుత్తరము తీసికొనివెళ్లియుండును. లేదా. ఆ యుత్తరము నా ప్రియుని వద్దనే యుండవచ్చును. భ్రమర తనకొకయుత్తరము వ్రాసియుండిన నాతో నా ప్రియుడు చెప్పకుండునా? అడిగి యీ యనుమాన పిశాచమును వదల్చుకొనియెద.’

అట్టియాలోచనయందు గంటలు గడచిపోయెను. తలనొప్పి మిషపై నాదినము గృహకృత్యములు వదల్చుకొనెను. రాత్రి ౮ గంటలకు శ్యామసుందరు డింటికి వచ్చెను. ప్రియురాలి యస్వస్థత తల్లివలన నెరింగి యామె పండుకొన్న స్థలమునకేగెను. కాని మునుపటిరీతి నాతని

బాహువుల నామె కంత మర్పించలేదు. ఇవన్నియు శ్యామసుందరుడు గమనింపలేదు. ఏదో యాలోచించుచుండెను. ముందు ఇందిరయే మాటాడెను. మోహనుడు గుంటూరు వెళ్లినవిషయ మాత డెరుంగునేమో కనుగొనెను.

"అవును; అతడు నా కావిషయ మెఱిగించెను. తనతో రమ్మని నన్ను బలవంత పెట్టుచుండెను. అత డెప్పు డీస్థలము విడిచెను?"

"ఈ మధ్యాహ్నమే. మీరు షికారువెళ్లిన తత్క్షణమే యాతడిక్కడకు వచ్చెను."

"నీతోనేమైన చెప్పెనా?"

"ఏమియులేదు. కొన్ని తమలపాకులు అతని కిచ్చితిని. అవి తీసికొని యతడు వెడలెను. భ్రమర సంగతి యేమి?"

తొట్రుపాటుతో "నాకేమి తెలియును?"

ఈమాటతో పెద్ద గాలివీచగా దీపమారి అంధకార మావరించిన ట్లామెకున్న యాకొంచె మాశయు తొలగిపోయి యామె మనసంతయు తమోమయమయ్యెను.

* * * *

మోహనుడు గుంటూరు వచ్చిన తరువాత తన గృహము విషయము మరచెను. అతడచ్చటనుండవలసినది రెండు దినములే. ఆతనియందు మార్పాతని పినతల్లి గమనించెను. ఆనందమయుడగు నాత డిప్పుడు చింతాకలితు డయ్యెను. ఆటలలో పాల్గొనడు. తన యీడువారి గూడడు. ఆనందజనకములగు నే విషయములందు ప్రవేశింపడు. ఒంటరిగా నుండును. మాటాడుటరుదు. ఏదైన ప్రశ్నకుత్తరము చెప్పవలసినపుడు వెడమాపు చూచును. 'విద్యాధిక్యమే యిట్టి నడతలకు కారణము. ఇప్పటి విద్యాధికుల స్వభావమే యిది' యని యాతని పినతల్లి తలంచెను.

బెజవాడ వెళ్లిరమ్మని తనతండ్రి మోహనున కుత్తరము వ్రాసెను. కాని యాతని పినతల్లి మోహనునిశరీరస్థితి బాగులేదనియు, గుంటూరులోనే యున్నచో నారోగ్యముగానుండుననియు ప్రత్యుత్తరమిచ్చుటచే మోహనుని తండ్రి మరువ్రాయక మోహనుపేరవచ్చిన యుత్తరములన్నియు నతనికి పంపించి వేయుచుండెను. అందు భ్రమర వ్రాసిన యుత్తర మొండు కలదు. దాని గాంచినంతనే మోహను డసూయాద్యోతక మందహాస మొనరించెను. ఆ యుత్తరమొకవంక పడవైచి తక్కినయుత్తరము లన్నియుజాగరూకతతో జూచి తుదను భ్రమర లేఖను విచ్చి చదివెను.

"హితా!

మీ యుత్తరముచూడ నాకు గలిగిన యానంద మపరిమితము. మీరు నన్నంతగా ప్రేమించుటకు నాయందే గొప్పతనము కాన్పించదు. శాశ్వతముగా నిట్టి దయ నాయందుండునట్లు దేవుడనుగ్రహించుగాక. మీ యందరకు దూరముగానుండుటచే నా హృదయ మెప్పుడు విచారయుతమైయుండును. దేవుడెన్నడు మనల నందర మరల బెజవాడలో సమావేశమగునట్లు చేయునో? మీరు నిరంతరమట్లు ఉత్తరములు వ్రాయనిచో నాకు మీపైకోపము కలుగకమానదు. పుణ్యక్షేత్రముల మరణము పొందు వారల యాత్మలు శాంతినొందునని పెద్దలందరు. నా యాత్మ మీ యొద్దనేయుండుటచే పుణ్యక్షేత్రమగు నీ తిరుపతిలో నొకవేళ నాకు మరణము కలిగినను నాయాత్మ కట్టిశాంతి కలుగబోదు. ఇందిరకు మదీయ దృఢాలింగనము. మమ్ముజూడ మీరిచటికి రాగూడదా? ఈ సందర్భమున మీరు మరువదగనిసంగతి యొకటి కలదు. గృహమేధి యిచ్చట పవిత్రాశీర్వాదములొందుటకు సహధర్మచారిణిలేనిది వలనుపడదు. జవాబున కెదురుచూచు చుండెదను. ఇట్లు-భ్రమర."

సంగ్రహమును, సామాన్యమును అగు ఉత్తరము చదువుచున్నంతసేపు మోహనుని చిత్తము చికాకు పొందుచుండెను. మొదట దాని నచ్చట విడువదలంచెను. కాని యెట్లో దానిని తుదముట్ట చదివెను. ఈర్ష్యాగ్రస్తమగు నాతనిచిత్తము తగినంత జాగ్రత్తతో దానిని చదువుట కిచ్చగింపలేదు. చివరమాట చూచినంతనే

యసూయతో తన వామహస్తమున నలిపివేసి కిటికీలోనికి విసరెను. మలగియున్న యుత్తరము కిటికీద్వారమునకు తగిలి వెనుకకు త్రుళ్లి యాతని పాదములవద్ద పడెను. ఆతరి నాత డేయాలోచనయందు మగ్నుడైయుండెనో కాని పడిన యుత్తరము తీసి జేబునందుంచి యెచ్చటికో వెడలెను.

*   *   *   *

శ్యామసుందరు భార్య ఇందిర బెజవాడలోనే కన్నవారింట నుండెను. ఇదివరకామె రెండుమూడు దినములకంటె నెక్కుడు కాలమచ్చట నుండుట కిష్టపడకుండెను. ఇప్పుడత్తింటికి వెళ్లుట కింతయు నాతురపడలేదు. కూతుల చిత్తవృత్తులు కనిపెట్ట జననులు చూచుచుందురు. ఇందిర జనని తనపుత్రిక యేదియో విషయముచే బాధచెందుచున్నదని గ్రహించి యామెను గనిపెట్టుచుండెను. పూర్వము శ్యామసుందరుడు కూడ నిందిరను నిజగృహమునకు గొంపోవ తొందరపడుచుండెను. ఇప్పు డొక్కమారైన నాతడు అత్తవారిల్లు త్రొక్కలేదు. భ్రమర తనకు వ్రాసిన యుత్తరము ఇందిరచదివి తపించుచున్నదని యతడు తలంచెను. దినములు గడచిన కొలది తనభార్యను చూడబోవ సిగ్గుచెందుచుండెను. దినమంతయు నొంటరిగా బయటనే గడుపుచుండెను. అప్పుడప్పుడాతని తల్లి యాతనితో ముచ్చటలాడుచు మాటలమధ్య నిందిరను తీసికొనిరమ్మని చెప్పుచుండెను. శ్యామసుందరు డట్టిసమయమున కోపముచూపుచు నచ్చోటు వీడిపోవుచుండెను.

అట్టియుత్తరము మోహనునిభార్యనుండి గ్రహించినందులకు కడు లజ్జించుచుండెను. అందులకు తానే కారణమని తలంచెను. మోహనునిభార్య కంత చనువిచ్చినందుకు తనను నిందించుకొనెను.

స్త్రీలు కుటిలచిత్తలనియు, పురుషుల నడవడులు స్త్రీలహృదయములం దెట్లుప్రతిఫలించునో యెరుగ నశక్యమనియు భ్రమరతో స్వేచ్ఛగా మాటాడకుండినయెడల నిట్టిది సంభవింపకుండుననియు తలంచెను. ఆహా! భ్రమర యెంతసాహసురాలు! బాల్యస్నేహితులగు మోహనశ్యామసుందరుల స్నేహబంధమును త్రెంచివేసినది. స్త్రీల ప్రవర్తనము హేయము. అను తలంపులు శ్యామసుందరుని హృదయమును తినివేయుచుండెను.

గౌరవమును సూచించు నుత్తరమేదియు భ్రమరకాతడు పంపలేదు. ఉమ్మిడి రామయ్యసెట్టి సోదరులకు కొంతపైకమంపి భ్రమరపేర నొక యంగుళీయకము—భ్రమర కోరినరీతిది—పంపుమని వారికి తెలిపెను. ఇట్లు పంపించుటచే భ్రమర తన చేదుకోరిక యీడేరినను నయ్యది యసూయతో బంపబడెనని తలంచునని యాతడుద్దేశించెను. వస్తువునుగాంచి పంపినవారెవరో తెలిసికొనలేక హేయభావమున నయ్యది పంపబడెనని భ్రమర తెలిసికొనును. అని తలంచి యాతడుత్తరమైనను వ్రాయలేదు. అతడనుకొనినట్లే భ్రమర తాను కోరినవస్తువుతో ప్రేమపూర్వకమగు లేఖ లేనందుకు కడు విచారించుచు కన్నీరు కార్చెను.

పుష్పఫలసంభరిత తరు సమన్వితమగు తీరమును నదీప్రవాహము క్రమక్రమముగా పాడుచేయుచున్నట్లు అనుమానము, అసూయ, విశ్వాసహీనత, ముప్పిరిగొని యానందముతో కాలముగడపుచున్న కుటుంబములను బాడుచేయు సమయమున సర్వశక్తి స్వరూపుడగు దేవుడు తన యాజ్ఞాదండచలనముచే ప్రవాహము నడ్డుగా త్రిప్పివేసెను.

*   *   *   *

మోహనుడు బెజవాడకు మరలివచ్చెను. మునుపటికంటె నిప్పటికి నాతనిలో చాల మార్పు కలిగెను. పెండ్లి అయినప్పటినుండి భార్యను విడిచి మోహనుడొంటరిగానుండు టెరుంగడు. కాన నుత్సాహవిహీనుడైయున్నాడని యాతనితల్లి తలచి భ్రమరను తీసికొనిరమ్మని మోహనునితో జెప్పెను. అందుపై నాతడామెవైపు శూన్యవీక్షణములు పఱపగా నామె భయమొంది యాతనితో నా ప్రశంస చేయుటయే మానుకొనెను.

‘మోహనుడు తఱుచు మాటాడడు. చిఱునవ్వు మోమున నెన్నడు దోపడు. శ్యామసుందరుడైన రా మానినాడు. ఒక్కమారైన నాతడిక్కడకు రాకపోవుట

యెంత శోచనీయము!' అని మోహనుని తల్లి తలంచుచు మోహనునిగాంచి "శ్యామసుందరు డెక్కడనున్నాడు? చాలదినములనుండి కాన్పించలేదు" అనెను. మోహనుడు "నాకేమియు నాతనిగురించి తెలియ"దనుచు నచ్చోటు వీడి వెళ్లబోవ నాతనితల్లి "ఒకమా రాతనియింటికి బోయి యీపూట భోజనమునకు పిలువుము." అనిచెప్పెను. అంత నాతడు "నేనొకరియింట భోజనమున కాహ్వానింపబడితిని. కాన నేనీపూటనింట భుజింపను. అనుచు వెడలిపోయెను.

ఏదో ప్రమాదము వాటిల్లెననియు దానిగూర్చి తెఱచియడుగుట కూడదనియుదలంచి ఆమె మిన్నకుండెను. దీని తెలిసికొనుటకు తగిన తెలివితేటలు కలది యిందిరయే యని యెంచి యామెను బిలువ సేవకురాలి నొకతెను బంపెను. ఇందిర రానియెడ తనకు గొప్ప ముప్పు వాటిల్లునని చెప్పుమనెను.

ఇందిరయు వెంటనే వచ్చెను. అక్కడకు వచ్చినందువలన తన కేదైన నూతనవిషయము లభింపగలదని యెంచెను. భ్రమర వ్రాసిన లేఖావృత్తాంతముగూర్చి తన చిత్తము తత్తరపడుచుండెను.

మోహను డింటలేడు. ఎవరియింటనో భోజనమునకే యేగెను. కావున నపరాహ్ణమునకు గాని రాడు. ఇది యిందిర కనుకూలము. మోహనుని తల్లి యిందిర నొక యేకాంత గృహమునకు గొంపోయి గడియవేసి యిందిర చేయిపట్టుకొని యిట్లనియెను. "మోహనుని చిత్తాస్వస్థతకు గారణమేమి? ఆతనిభార్య పేరెత్తిన సహింపడు. ఈ యుదయము శ్యామసుందరు నిచ్చటకు గొని రమ్మనికోర ననాదరణతో నిల్లువెడలిపోయెను"

అన నిందిరయు "న న్నావిషయమే బాధించుచున్నది. దీని మూలకారణ మారయవలెను. చిరకాలము నుండి నా కన్నవారియింటనున్న నాకు దాని నిజస్వరూపమెఱుంగ నెట్లు శక్యమగును?"

ఈ మాటలు చెప్పుచున్నపుడు పూర్వపు ఠీవి యిందిరయందు గన్పడలేదు. ముఖమునందలి కళయంతయు విచారముచే తగ్గినది. ఈ విషయము గమనించినతోడనే యిందిరను గూర్చి మోహనుని తల్లి యెక్కువగా విచారించెను. కడు గారాబముతో నామె చెక్కిలి ముట్టి "నీవేదైన జబ్బుచే బాధ నొందుచున్నావా?" యని యిందిరను బ్రశ్నించెను.

ఇందిర ప్రత్యుత్తరము తత్‌క్షణ మీయజాలకుండెను. అమె కన్నులు బాష్పపూరితములయ్యెను. మోహనునితల్లి యాతురపడి తత్‌క్షణ మామెచేయిపట్టుకొని యాగదిలోనుండి భోజనగృహమునకు గొంపోయి "ముందు భుజింపుము. నీ వలసియున్నావు. భోజనానంతరము మనము మాటాడవచ్చును" అనెను.

ఇందిర భోజనమువద్ద గూర్చుండెను. ఆమెను మోహనునితల్లి ప్రేమతో నాదరించుచు గావలసిన పదార్థముల వడ్డించుచుండెను. ఈయాదరణచే నిందిరకన్నులు మునుపటికంటె నెక్కుడు బాష్పములచే నిండెను. ఇంతకుముందు ఇందిర హృదయ మొక్కటియే విచారభూయిష్ఠమై యుండెను. ఇప్పుడు వీరి పరస్పరప్రేమాతిశయములచే విచార మిరువురు పాల్గొనిరి. ఆ కారణమున నిందిరయందలి శాంతికి బలము తగ్గెను.

ఎట్లో భుజించి మోహనుడు చదువుకొను గదిలోనికి బ్రవేశించి మునుపటిశోభ లేనందులకు విచారించెను. పుస్తకములు మేజాపై చిందరవందరగా నుండెను. ఏ వస్తువు సరియగు స్థితిలో నుండలేదు. చినిగిన కాగితములు వార్తాపత్రికలు బల్లపైనను, క్రిందను కుప్పలుగా పడియుండెను. గదియంతయు ధూళిచే దట్టముగా కప్పబడి యుండెను. కొయ్యలపై దుస్తులుండక కుర్చీపై బడియుండెను. పడకకుర్చీపై మురికిదుస్తులు దొర్లాడుచుండెను. మోహను డందు లేడు. కాని యాతని చిత్తస్థితియంతయు గదిలోనున్న వస్తువులస్థితి తెలియజేయుచుండెను. కొంతవరకు ఇందిర తన్నే మఱచియుండెను. ఒకటి తరువాత నొకటిగా కిటికీలన్నియు నామె తెఱచెను. గదిలోనున్న వస్తుజాలమును క్రమస్థితిలో నుంచనందుల కామె మోహనుని తల్లిని మనసులో నిందించుచుండెను.

మోహనుని తల్లి యాసమయమున భోజనము చేయుచుండెను. ఇందిర యింతలో నా వస్తుజాలమును

సరిగా నుంచుటకు యత్నించుచుండెను. మురికి దుస్తులన్నిటిని మూటకట్టి వేరుగానుంచెను. చొక్కా యీబొత్తాముల నామె తీసి మేజాబల్లలో నుంచెను. ఆ యుత్తరములలో నొకటి భ్రమర వ్రాసినది కాంచెను.

ఉత్తరము నలిపివేయబడియుండుటగాంచి విచారించెను. గుంటూరులో మోహను డుండునపుడు చేరిన యుత్తరమే యది. దానిని నలిపి పాడుచేయయత్నించి మరల జేబులో నాతడు దాచియుంచియుండెను. ఈర్ష్యాగ్రస్తుడై మోహను డా యుత్తరమున కట్టి దుస్థితి కలిగించెనని గ్రహించి ధానిని సరిజేసి చదివి భ్రమర దుష్టబుద్ధికి విచారపడి కారణమారయుచుండెను. ఇంతలో మోహనుని తల్లి గదిలో బ్రవేశించెను. తత్క్షణమే ఇందిరయుత్తరమును మేజాబల్లపై నొక పుస్తకము క్రింద నుంచెను. ఇందిర విచారముతోనున్నట్టామె గ్రహించెను. కాని ఇందిర నందువిషయమై ప్రశ్నింప నియ్యకొనలేదు. కొంతసేపైనతరువాత ఇందిర తన కన్నవారి యింటికిమరలెను.

*　　*　　*　　*

రెండుమూడు దినములు పోయినపిదప మోహనుని తల్లి యిందిరను రప్పించెను. ఈ పర్యాయము మోహనుతల్లి యిందిరను మనఃపూర్తిగా నాశీర్వదించెను. ఇందిర మోహను డుండుగది ప్రవేశించెను. ఆమెను గాంచి మోహనుడు వెల్లబోయెను. ఆతని మోమునందలి వివర్ణత గాంచినతోడనే యామెకు దుఃఖము పొరలివచ్చెను. అంత మనోహరాకార మింతవివర్ణత బొందుట కద్భుతమందెను. ఆతని బిలువలేక పిలువలేక తుదకు "మీరెట్లున్నారు!" అని ప్రశ్నించెను. "ఏదోయొకతీరుననున్నాను." అని మోటుగా బలికెను. "భ్రమర వార్తయేమైన మీకు తెలియవచ్చెనా?" అని మరల బ్రశ్నించెను. మోహనుడు కొంతసేపటికు మిన్నకుండి యేమియు పాలుబోక మేజాబల్ల నుండి యుత్తరమొండు తీసి యామె వైపు విసరెను. ఇందిర యా లేఖను చదివెను. అందట్లున్నది.

"ప్రాణప్రియా!

మీవద్దనుండి చాల దినములనుండి లేఖలేమియు రాలేదు. మీ పినతల్లిగారి కుమార్తె వివాహమునకై గుంటూరు పోవుచున్నట్లు మీ చివరలేఖలో వ్రాసితిరి. అక్కడ కార్యభారముచే నుత్తరములు వ్రాయ మీకవకాశము చిక్కలేదని మొదట తలంచితిని. విమల వ్రాసిన యుత్తరమువలన మీరు బెజవాడకు మరలివచ్చితిరని తెలిసికొంటిని. మీరు వచ్చి ఎనిమిది దినములు గతించినవి. ఇంతకాలములో నొక యుత్తరమైన వ్రాయుటకు మీకవకాశము లేకపోయెనా? నేనుకూడ మీకు వ్రాయలేదు. అట్లు వ్రాయకుండుటకే నిశ్చయించితిని. ప్రతిదినము మీ యుత్తరమున కెదురు చూచిచూచి విసుగునొంది యట్టియాశ విడిచితిని.

మీకు నాపై కోపమా? ఇదివర కెన్నడు మిమ్మేదియు యాచింపలేదు. అట్లడుగుట నేరమా? అట్లయిన మరల నెన్నడేదియు నడుగను. నాకు మంచినీతి గఱపితిరి. ఏవో బహుమానముల కేనా స్త్రీలు పురుషుల పాదాక్రాంతలు కావలసినది? అట్లు తలంచి మీరు పొరపడితిరి. నాసంగతియా? నేనట్టిది భరింపగలను. కాని ప్రేమరహితమగు బహూకృతి నేనంగీకరింపజాల.

అంత కాఠిన్యము మీరు నాయెడ వహించెదరని నేను కలనైన నెరుంగను. నేను మీకు కోపము కలిగించి యుండవచ్చును. అది మీరెరుగుదురు. నా మనోవ్యాకులత తిరుపతి వెంకటేశ్వరుడెరుంగును.

దురదృష్టవంతురాలు,
భ్రమర"

ఉత్తరము 'కవరు' లో నుంచుచు నిందిర "మీకీ యుత్తరమెప్పుడు చేరినది?" అని యడిగెను. "కొన్నినిముసముల క్రిందటనే" యను జవాబు వచ్చెను. "ఆ బంగీయేమి?" అని మరల నిందిర యడిగెను. ఆ విషయప్రశంస యిష్టములేని స్వరముతో "నాకు తెలియ"దని యాతడు చెప్పెను. ఇందిర యాపలుకు పెడచెవినిబెట్టి మేజాబల్ల వైపు నడచి దానిపైనున్న బంగీపట్టుకొని పైవిలాసము చూచి "ఇది తిరుపతినుండి వచ్చినట్లున్నది." అనెను. ఆప్రశంసయే మరల చేయుట యిష్టములేనివానివలె "కావచ్చును." అని మోహనుడు పలికెను. మోహనుడు దానిగూర్చి బాగుగా నెఱిగియుండియు నలక్ష్యభావమున

నున్నాడని గ్రహించి బంగీవిప్పెను. అందు అంగుళీయకము ముఖ్మల్ దిండున నమరియుండెను.

ఆమె దానిగాంచి భయకంపితయై మరల "ఇక్కలి

అందమగు నంగుళీయకము, దీని నెప్పుడుకొంటిరి?" అని యడిగెను. మోహనుడు కొంతదనుక మిన్నకుండి "నాకు కూడ నీవలె దానిని గాంచుట నూతనమే." అనిపలికెను. ఈ విషయమామెకు పెద్దచిక్కుగానుండెను. "అయితే మీరు దీనిని భ్రమరకొఱకు కొనలేదా?" అని మోహనుని మరలనడిగెను. "ఇదివరకే దానికి జబాబుచెప్పితిని." అని కోపముతో బలుకుచు నస్థిమితచిత్తుడై యటునిటు గదిలో తిరుగుచుండెను.

తత్‌క్షణమే యిందిర బుద్ధి కేదియో గోచరించెను. ఆమె గదివిడిచి మోహనుని తల్లివద్దకువచ్చి యేమియో యామెతో జెప్పి వడివడి మెట్లుదిగి క్రిందికివచ్చెను. ఆమె కొరకు వేచియున్న బండినెక్కి కన్నవారియింటికి వెడలెను. ఇంతలో మోహను డీబంగీనిగూర్చిన సంశయము తీరనందుకు విచారించుచుండెను. 'భ్రమర యంగుళీయకము పంపుమని శ్యామసుందరునికి వ్రాసియుండవచ్చును. అతడు పంపియుండవచ్చును. అయితే ఆ యంగుళీయకమిదియేనా? అదే యయినయెడ నామె యెందులకు తిరిగి పంపును?'

ఇట్టి యాలోచనలో నుండు సమయమున నిందిర మరల గదిలో ప్రవేశించెను. మోహనుడు ఆనందమును సూచించు నామె మోముగాంచి విభ్రాంతు డయ్యెను. అంత నిందిర "భ్రమరవ్రాసిన యుత్తరమొకటి యీ మేజాపై నాదినము నేను కాంచితిని, అది నాకొకమారీయవచ్చునా?" మోహనుడు దానిని పోల్చెను. ఇందిర దానిలో తేదీని గుర్తించెను. చిరునవ్వు నవ్వెను. తాను తనవద్ద దాచియుంచిన లేఖయొకటి పైకితీసి మోహనునకు జూపుచు "మీ యుత్తరము మీరు కొనుడు. మీవద్ద నింతకాల ముపేక్షతో జూడబడుచున్న యీ యుత్తరము మీ ప్రియమిత్రునిది. నేను దాని గొంపోయి యాతని కొసగెదను." వేయి క్రొవ్వువత్తులకాంతినిచ్చు విద్యుద్దీపము వెలిగింపబడగానే గదిలోని యంధకారము పంచబంగాళమగునట్లు మోహనునకు ఈర్ష్యానుమానములచే గలిగిన యజ్ఞానాంధకారము ఇందిర విజ్ఞానప్రాబల్యమున తొలగిపోయెను. మోహనుడు మైనరచెను. అప్రయత్నముతో నామె దారి కడ్డు నిలిచెను.

అర్థవంతమగు చిరునవ్వు నగుచు నిందిర "భ్రమర క్షేమము మీరు కోరెదరేని వెంటనే తిరుపతికేగి యామెవద్ద మీ నేరమునకు క్షమాపణ కోరుకొనుడు." అన్నెను. "నన్నొకమారా యుత్తరమును జూడనిమ్ము" అని మోహనుడన నిందిర యాతని కుత్తరమిచ్చి "మీరే యీ యుత్తరముహక్కుదారున కిచ్చివేయుడని చెప్పుచు వెడలిపోయెను. అనుమానజలదాచ్ఛాదితమగు మోహనుని హృదయాకాశము నిష్కల్మషమాయెను. సాయంసంధ్యారాగము ఆతని మోమున కందమిచ్చెను.

ఆయుత్తరములు రెండింటిని పరిశీలించి తేదీలో క్కటియేయని కనిపెట్టి యథార్థస్థితి తెలిసికొనెను. తనకు వ్రాసిన యుత్తరము శ్యామసుందరుని విలాసమున్న కవరులోను, శ్యామసుందరునికి వ్రాసినయుత్తరము తన విలాసమున్న కవరులోను పొరపాటున భ్రమర పెట్టెనని యతడు గ్రహించెను. తన తప్పిదమునకు కడు

విచారించెను. శ్యామసుందరుని కలుసుకొనిన తత్క్షణమే తిరుపతివెళ్ల నిశ్చయించెను.

"మీకే యీయుత్తరము హక్కుదారున కిచ్చివేయుడు"

*   *   *   *

ఇందిర తన కన్నవారియింటికేగి తల్లిపాదముల కెరగి యత్తవారియింటికి వెంటనే బయలుదేరెను. శ్యామసుందరు డెట్లు మోసపోయెనో యెరిగించుచు నాతని నిందిర పరిహాసోక్తుల ముంచుచున్న సమయమున మోహాను డక్కడకు వచ్చి చేరి యాతని గాఢాలింగన మొనరించెను. శ్యామసుందరు డాతని తిరిగి కౌగలించి యంతయు గ్రహించి కన్నీళ్లు జార్చెను. మోహానునితో బెజవాడవెళ్లి తిరుపతిప్రయాణమునకై యాతని పురికొల్పెను. అంగుళీయకము తన పట్టు చేరుమాలున జుట్టి మోహానుని చేయిపట్టి "మోహానా! నామాటయొకటి చెల్లింపుము. నే నీయంగుళీయకమును బంపితి"నని భ్రమర కెరిగింపకుము. అంగుళీయకము భ్రమర పేరను పంపుమని నగలవర్తకునికి వ్రాసితిని. ఇప్పటికి నామె నీవే దానిని బంపితివని తలంచియున్నది. ఆయభిప్రాయము మాత్రము నీవు తప్పింపకు. నేనెట్టి దురభిప్రాయమునను దానిని బంపలేదు. నేను నీవు క్షమింపగలవని యెరుంగుదును. కాని భ్రమరకు తెలసిన నన్ను క్షమింపదు. నేనామె విషయమున పొరపాటుగా ప్రవర్తించితిని."

మోహాను డందులకడ్డువచ్చి "నేను నిన్నుచాల నవమానపరచితిని. అట్టి ప్రియమిత్రునియందు నాకు విశ్వాసము లేకపోవుటెట్లు? నాకు నిన్నుగాంచ సిగ్గగుచున్నది." అని గద్గదస్వరముతో బలికెను.

*   *   *   *

శ్యామసుందరుడు రైల్వేస్టేషనువరకు మోహాను ననుసరించెను. మోహానుడు బండియెక్కెను. ఆతడు తిరుపతి చేరినవెంటనే భ్రమరయున్న గదికేగెను. ఆమె విచారావస్థగాంచి యాతురతతో నామెను కౌగిలించి

"భ్రమరా! చిన్నచిన్న నేరములు క్షమింపబడవలెను. తిరుపతి వేంకటేశ్వరుడు మనల నొక్కటి చేయుగాక" యని పలికెను.